# పంటలకు బీమా కరువు

- పంట నష్టపోయినా అందని పరిహారం
- ఫసల్ బీమా యోజన నుంచి వైదొలగిన గత సర్కార్
- ఇంకా కొత్త పథకం రూపొందించని ప్రస్తుత ప్రభుత్వం
- అధిక వర్షాలతో దెబ్బతిన్న పంటలు

| పంట నష్టం సర్వే వివరాలు.. | |
|---|---|
| పంట నష్టపోయిన రైతులు | 12,775 |
| పంట నష్టం(ఎకరాల్లో) | 17,496 |
| పత్తి | 13,804 |
| మొక్కజొన్న | 290 |
| కంది | 300 |
| సోయాబీన్ | 2,802 |
| ఇతర పంటలు | 300 |


దెబ్బతిన్న పంటల వివరాలు నమోదు చేస్తున్న ఏఈవో (ఫైల్)

**బోథ్:** రాష్ట్రంలో పంటల బీమా లేకపోవడంతో రైతుల పంట నష్టానికి పరిహారం అందడం లేదు. పంటల బీమా అమలు కాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గత రెండు సంవత్సరాల నుంచి అధిక వర్షాలతో జిల్లాలోని మండలాల్లో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ ఏడాది అధిక వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయి. ఇప్పటికీ పలు ప్రాంతాల్లో పంటలు నీటమునిగి ఉన్నాయి. ప్రభుత్వం పంటలు నష్టపోయిన చోట వ్యవసాయాధికారులతో వివరాలు నమోదు చేయించింది. అయితే నష్టపరిహారంపై ప్రభుత్వం నుంచి స్పందన లేదు. పంటల బీమా ఉన్నా నష్టపోయిన పంటలకు బీమా పరిహారం వచ్చేదని రైతులు పేర్కొంటున్నారు.

**ఆరేళ్ల నుంచి..**

అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం నుంచి వైదొలగడంతో రాష్ట్రంలో ఆరేళ్ల నుంచి పంటలకు బీమా పథకం లేదు. వివిధ కారణాలతో, విపత్కర పరిస్థితుల్లో అధిక వర్షాలతో పంట నష్టం జరిగితే పంటల బీమా రైతులకు ఆసరాగా నిలుస్తుంది. గతంలో రైతులు పంట నష్టపోతే పంటల బీమా ద్వారా కొంతమేరకు లబ్ధిపొందారు. కానీ ప్రస్తుతం రాష్ట్రంలో పంటల బీమా లేకపోవడంతో రైతులకు పరిహారం అందడంలేదు.

**ఊసెత్తని ప్రభుత్వం..**

అధికారంలోకి వస్తే పంటలు నష్టపోయిన రైతులకు తక్షణ పరిహారం అందేలా పంటల బీమా తీసుకొస్తామని అసెంబ్లీ ఎన్నికల ముందు తెలంగాణ కాంగ్రెస్ కమిటీ రూపొందించిన అభయహస్తం మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. ఈ మేరకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో చేరుతుందా..? లేక రాష్ట్రంలో కొత్తగా పంటల బీమా పథకం తీసుకువస్తుందా అన్నది ప్రశ్నగా మిగిలింది. బీమాపై పలుమార్లు ప్రభుత్వం చర్చలు జరిపినా ఇంకా నిర్ణయం తీసుకోలేదు. పంటల బీమాకు సంబంధించిన మొత్తం కిస్తీ ప్రభుత్వమే చెల్లిస్తుందని పేర్కొన్నా ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు.

**బీమాతో మేలు**



పంటల బీమా ఉంటే పంట నష్టపోయిన రైతులకు ఆసరాగా ఉంటుంది. పంట పరిహారం అందుతుంది. గత రెండేళ్లుగా అధిక వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. దీంతో రైతులు నష్టోయారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించలేదు. పంటల బీమా ఉంటే ఇన్సూరెన్స్ కంపెనీలు నష్ట పరిహారం అందించేవి.

– ఇట్టెడి మోహన్ రెడ్డి, స్వయం కృషి రైతు సంఘం అధ్యక్షుడు

## అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలి


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్


భీంపూర్‌లో దుర్గామాతకు పూజలు చేస్తున్న జనార్ధన్‌నాయక్

**ఇంద్రవెల్లి:** దుర్గామాత ఆశీస్సులు ఖానాపూర్ నియోజకవర్గం ప్రజలందరిపై ఉండాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక రాధాకృష్ణ ఆలయ ప్రాంగణంలో నవయువ దుర్గా ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలకేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారి చింతవార్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామ పటేల్ మారుతి డొంగ్రె, ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, వ్యాపారస్తులు సంతోష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

**నార్నూర్‌లో..**

**నార్నూర్:** ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలని ఆదిలాబాద్ జిల్లా మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ గ్రామంలో దుర్గామాతకు పూజలు చేశారు. గ్రామ నాయక్ రాజునాయక్ రాథోడ్, మాజీ సర్పంచ్ విష్ణురాథోడ్, ప్రవీణ్ నాయక్ తదితరులు ఉన్నారు.

**ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు**

**నేరడిగొండ:** మండలంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ముగిశాయి. మండలంలోని ఆయా గ్రామాల్లో దసరా పండుగ సందర్భంగా వాహన, ఆయుధ పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో గల ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. మండల వ్యాప్తంగా విజ య దశమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఒకరికొకరు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.

## జనహిత వేదిక ద్వారా సామాజిక సేవలు

**ఇచ్చోడ:** జనహిత వేదిక ద్వారా సామాజిక సేవలు చేపట్టనున్నట్లు జనహిత వేదిక స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కిన్నెర్ల మనోహర్ రెడ్డి తెలిపారు. దసరా పండుగ సందర్భంగా గురువారం మండలంలోని పట్వారిగూడ రామాలయంలో నూతనంగా జనహితవేదిక స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేశామన్నారు. అధ్యక్షుడిగా కిన్నెర్ల మనోహర్‌రెడ్డి, రిటైర్డ్ తహసీల్దార్, చీఫ్ అడ్వయిజర్‌గా ఏలేటి జీవన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా బొడ్డు బోజన్న, సల్లబోజరెడ్డి, జాయింట్ సెక్రటరీగా ఒరగంటి ఇస్తారి, జ్ఞానోబా, కల్చరల్ సెక్రటరీగా నర్సయ్య, స్పోర్ట్ సెక్రటరీగా వెంకన్న, కోశాధికారిగా ప్రకాశ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.


నూతనంగా ఎన్నికైన జనహిత వేదిక సభ్యులు

## క్లుప్తంగా

### ‘వాటర్‌ప్లాంట్ ఏర్పాటు అభినందనీయం’


వాటర్‌ప్లాంట్ ప్రారంభిస్తున్న ఆడే గజేందర్

**నేరడిగొండ:** గ్రామీణ ప్రాంత ప్రజలకు శుద్ధమైన నీరు అందించేందుకు ఆడే సకారాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. ఆడే సకారాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో బొందిడి గ్రామంలో రూ.4లక్షలతో ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ క్రాంతి కుమార్, డాక్టర్ రజిత, ఆడే సతీశ్ నాయక్, ఆడే పరశురాం నాయక్, ఆడే గోవింద్ నాయక్, ఆడే చంద్రశేఖర్, సీతారాం, ఆడే జనార్దన్, ఆడే కైలాష్, ఆడే విక్రమ్, రాథోడ్ సుభాష్, ఆడే జ్ఞానేశ్వర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### భూమికి పచ్చని రంగేసినట్టు..!


చూపరులను ఆకట్టుకుంటున్న వరిపొలాలు

**ఉట్నూర్‌రూరల్:** మండలంలోని గంగన్నపేట చెరువు కింద సాగు చేస్తున్న వరి పొలాలు భూమికి పచ్చని రంగేసినట్లు చూపరులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. ఆహ్లాదకర వాతావరణం ఏర్పడటంతో మండల వాసులు ప్రకృతిని ఆస్వాదిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం వరిపొలాల దృశ్యాలను ‘సాక్షి’ తన కెమెరాలో బంధించింది.

### శాలివాహన వెల్ఫేర్ ఫోరం అధ్యక్షుడిగా మహేశ్


మహేశ్

**బోథ్:** సొనాల శాలివాహన వెల్ఫేర్ ఫోరం అధ్యక్షుడిగా సిర్పూర్ మహేశ్ ఎన్నికయ్యారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ శాలివాహన వెల్ఫేర్ ఫోరం అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. శాలివాహన వెల్ఫేర్ ఫోరం సభ్యులు గొల్లపెల్లి రాజేశ్వర్, సిర్పూర్ సత్యనారాయణ, గొల్లపెల్లి వినోద్, సిర్పూర్ శ్రీనివాస్, అంగొపెల్లి రాజశేఖర్, రవి, రాకేశ్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు. కాగా మహేశ్‌ను ఏబీసీ విచార్ విభాగ్ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ తుల అరుణ్ కుమార్, స్వామి వివేకానంద యూత్ అధ్యక్షుడు ఇర్ల అభిలాష్‌లు ఘనంగా సత్కరించారు.

### లో లెవల్ బ్రిడ్జికి మరమ్మతు


బ్రిడ్జికి మరమ్మతు చేస్తున్న గ్రామస్తులు

**లింగాపూర్:** నెలరోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని నాగుగూడాలోని లోలెవల్ వంతెన వరదకు దెబ్బతింది. అప్పటి నుంచి రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. గ్రామస్తులు, జ్వర పీడితులు, గర్భిణులు వంతెన దాటాలంటే కనీసం గంట నుంచి రెండు గంటల వరకు పడుతోంది. దీంతో శుక్రవారం గ్రామస్తులు, యువకులు బ్రిడ్జిపై బండరాళ్లు పేర్చారు. మొరం తెప్పించి చదును చేసి మరమ్మతు చేసుకున్నారు.

### ఆర్థికసాయం అందజేత

**ఆసిఫాబాద్‌రూరల్:** ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని గుండి గ్రామానికి చెందిన కోలే ప్రవీణ్ చికిత్స కోసం వాట్సప్ గ్రూప్ ద్వారా విరాళంగా సేకరించిన రూ.1,37,421 నగదును శుక్రవారం అతడి తల్లికి అందజేశారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి కూడా రూ.50వేలు అందించారు. వైద్యులు ప్రవీణ్ వైద్యఖర్చుల కోసం రూ.15 లక్షల వరకు అవుతుందని అతడి కుటుంబీకులు తెలిపారు. ఇప్పటివరకు సాయం అందించినవారికి కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా సాయం అందించాలనుకునే దాతలు 9705637527, 9959795152 నంబర్లకు ఫోన్ పే చేసి ఆదుకోవాలని కోరారు.

### ఆకతాయిలకు కౌన్సెలింగ్

**కాగజ్‌నగర్‌టౌన్:** దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని త్రిశూల్ పహాడ్‌పై రావణసుర దహన సమయంలో అమ్మాయిలను వేధించిన ఆరుగురు ఆకతాయిలను పట్టుకున్నట్లు షీటీం ఇన్‌చార్జి సునీత శుక్రవారం తెలిపారు. యువకులకు తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. మహిళలు, యువతులు వేధింపులకు గురైతే షీటీంను సంప్రదించాలని సూచించారు.

# ఘనంగా దసరా వేడుకలు


సిరికొండలో పూజలు చేస్తున్న గ్రామస్తులు


నేరడిగొండ: ఆయుధ పూజ చేస్తున్న అనిల్ జాదవ్

**నేరడిగొండ:** బోథ్ నియోజకవర్గం వ్యాప్తంగా దసరా పండుగను గురువారం ఘనంగా జరుపుకున్నారు. విజయదశమి సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మండల కేంద్రంలోని ఆయన నివాసంలో కుటుంబ సమేతంగా ఆయుధ పూజ నిర్వహించారు. అనంతరం వాహనాలకు పూజలు జరిపారు. పండితుడు డాక్టర్ శ్రావణ్ కుమార్ జోషి మంత్రోచ్చరణాల మధ్య కార్యక్రమాలు సాగించారు.

**తాంసి:** మండలంలోని పలు గ్రామాల్లో గురువారం దసరా వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో సాయంత్రం డప్పుచప్పుళ్ల మధ్య గ్రామస్తులు జమ్మి చెట్టు వద్దకు ఊరేగింపుగా వెళ్లారు. జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఒకరికి ఒకరు దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండలంలోని తాంసి, జామిడి, కప్పర్ల, వడ్డాడి, గోట్కూరి, సావర్గాం, పొన్నారి, పాలోది, బండల్‌నాగాపూర్, హస్నాపూర్ గ్రామాల్లో దసరా ఘనంగా జరుపుకున్నారు.

**నార్నూర్:** నార్నూర్, గాదిగూడ మండలాలలో విజయదశమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఆదివాసీ గూడాలలో రైతులు వ్యవసాయ సామగ్రికి ప్రత్యేక పూజలు చేశారు. వాహనదారులు తమ వాహనాలకు పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీ ఖాందేవ్ ఆలయంలో తొడసం వంశీయుల ఆధ్వర్యంలో ఖాందేవ్ ప్రతిమలకు సాంప్రదాయ పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ ఎంపీపీ మెస్రం రూప్‌దేవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తొడసం నాగోరావు, తొడసం వంశీయులు, ఆదివాసీ పెద్దలు పాల్గొన్నారు.

**సిరికొండ:** మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో గురువారం దసరా పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవతలకు, జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. ఒకరికొకరు జమ్మి ఆకు (బంగారం) ఇచ్చి పుచ్చుకున్నారు.


ఉట్నూర్‌రూరల్: పూజలో పాల్గొన్న వెడ్మ బొజ్జు

**వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు**

**ఉట్నూర్‌రూరల్:** ఉట్నూర్ మండలంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో దసరా వేడుకలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. హిందు ఉత్సవ సమితి ఆధ్వర్యంలో పాత ఉట్నూర్‌లోని రామాలయం వద్ద రావణాసురుని దిష్టిబొమ్మ దహన కార్యక్రమం చేపట్టారు. అనంతరం జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఖానాపూర్ ఎమ్మెల్యే ఇంట్లో కుటుంబ సమేతంగా పూజల అనంతరం, వాహనాలకు పూజలు నిర్వహించారు. సాయంత్రం రామాలయం వద్ద నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ద్విచక్రవాహనంపై వెళ్లి పాల్గొన్నారు. బీజేపీ నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి రితేశ్ రాథోడ్, శ్రీరాంనాయక్, హిందు ఉత్సవ సమితి నాయకులు గోపి, కొండేరి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.


తాంసిలో జమ్మి చెట్టు వద్ద పూజలు చేస్తున్న గ్రామస్తులు


నార్నూర్: ఖందేవ్ ఆలయంలో పూజలు చేస్తున్న తొడసం వంశీయులు

## మహనీయులకు ఘన నివాళి


నేరడిగొండ: గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్


ఆదిలాబాద్‌టౌన్: గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జోగు రామన్న

**నేరడిగొండ/ఉట్నూర్‌రూరల్/ఆదిలాబాద్‌టౌన్/సిరికొండ:** జిల్లాలో మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రిల జయంతులు గురువారం ఘనంగా నిర్వహించారు. నేరడిగొండలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో పీవో ఖుష్బూ గుప్తా, జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదిలాబాద్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డిల ఆధ్వర్యంలో ఘనంగా జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ, శాస్త్రిల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.


ఆదిలాబాద్‌టౌన్: చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు


ఉట్నూర్‌రూరల్: నివాళులర్పిస్తున్న పీవో ఖుష్బూగుప్తా, అధికారులు

### కాంగ్రెస్‌లో చేరికలు


పార్టీలో చేరుతున్న నాయకులు

**బోథ్:** సొనాల మండలంలోని సాకెర, కోత కె గ్రామానికి చెందిన పలువురు నాయకులు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఏబీసీ విచార్ విభాగ్ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ తుల అరుణ్ కుమార్ వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. రాథోడ్ బాబూలాల్‌తో పాటు పలువురు పార్టీలో చేరారు. కాగా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలనతో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఆశాజ్యోతిగా మారిందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే ధ్యేయంగా పనిచేస్తామని, కాంగ్రెస్ విజయానికి కృషి చేస్తామని పార్టీలో చేరిన నాయకులు తెలిపారు. సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ రమేశ్ బత్తుల, గాజుల పోతన్న, అనిల్, పోతన్న, విజయ్ భాస్కర్ రెడ్డి, జ్ఞానేశ్వర్, మాధవరావు పటేల్, కాకాజీ, రామ్ చందర్, సుదర్శన్, అమిత్ రావు, బాబురావు, జాలం సింగ్, సురేశ్, రాందాస్, సోమన్న పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ


జాదవ్ ప్రతాప్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**ఇచ్చోడ:** మండలంలోని జామిడి గ్రామానికి చెందిన జాదవ్ ప్రతాప్ భార్య గత వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో శుక్రవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ జామిడిలో జాదవ్ ప్రతాప్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి, నాయకులు గాడ్గే సుభాష్, పాండురంగ్, వెంకటేశ్, రాథోడ్ ప్రవీణ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

**ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పరామర్శ**

**ఉట్నూర్‌రూరల్:** ఉట్నూర్ మండలం హర్కాపూర్ గ్రామంలో ఎల్లయ్య శుక్రవారం ఉదయం మృతి చెందగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఎల్లయ్య భౌతికకాయానికి నివాళి అర్పించారు.

### క్షతగాత్రులను ఆస్పత్రికి తరలింపు

**నేరడిగొండ:** మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కారు బోల్తా పడింది. అటువైపుగా వెళ్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ విషయాన్ని గమనించి తక్షణమే అంబులెన్స్‌కు సమాచారం అందించారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.


ఘటన స్థలం నుంచి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న ఎమ్మెల్యే

## బుద్ధుడు చూపిన శాంతిమార్గంలో నడవాలి

**ఇంద్రవెల్లి:** గౌతమ బుద్ధుడు చూపిన శాంతి మార్గంలో నడిచి ప్రశాంత జీవనం గడపాలని పూజ్య భంతే కమల్ ధమ్మా సూచించారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన 69వ ధమ్మ చక్ర పరివర్తన్ దివస్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గౌతమ బుద్ధుని, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, అంబేడ్కర్ మెమోరియల్ అసోసియేషన్ సోన్‌కాంబ్లే జితేందర్, దళిత సంఘాల నాయకులు కాంబ్లే మారుతి, సావంత్ రాజవర్ధన్, కాంబ్లే ఉత్తం, సావంత్ లహుదాస్, పరత్‌వాగ్ దత్త సూర్యవంశీ, కామ్‌రాజ్ వాగ్మారే, మస్కే రాజువర్ధన్ తదితరులు ఉన్నారు.

**ఇచ్చోడలో..**

**ఇచ్చోడ:** మండల కేంద్రంలో దసరా సందర్భంగా గురువారం అశోక ధమ్మచక్ర పరివర్తన్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద పంచశీల జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు దూబాక సుభాష్, పొనకంటి ఆశన్న, భూమయ్య, గోపి తదితరులు పాల్గొన్నారు.


ఇంద్రవెల్లి: మాట్లాడుతున్న నాయకులు

**నార్నూర్, గాదిగూడ మండలాల్లో..**

**నార్నూర్:** నార్నూర్, గాదిగూడ మండలాల్లో 69వ ధమ్మ చక్ర పరివర్తన్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. దళిత వాడల్లో అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గౌతమ బుద్ధునికి ప్రత్యేక పూజలు చేశారు. పంచశీల జెండా ఆవిష్కరించారు. సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ మాట్లాడుతూ నేటి తరం యువత మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్లాలన్నారు. నార్నూర్ సహకార సంఘం చైర్మన్ ఆడే సురేశ్, హేమలతా బ్రిజ్జి లాల్, నాయకులు పాల్గొన్నారు.

## గిన్నిస్ రికార్డు ఈవెంట్‌కు కరాటే మాస్టర్స్

**ఆదిలాబాద్:** ది వరల్డ్ కరాటే మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 5వ తేదీన చెన్నైలోని సిల్వేస్ కాలేజీ మైదానంలో నిర్వహించనున్న కరాటే మాస్టర్స్ ఆత్మరక్షణ గిన్నిస్ రికార్డు ప్రదర్శనలో జిల్లాకు చెందిన కరాటే మాస్టర్స్ చోటు దక్కించుకున్నారు. ఇందులో భాగంగా ప్రదర్శన చేసేందుకు శుక్రవారం మంచిర్యాల నుంచి బయలుదేరి వెళ్లారు. జిల్లా కేంద్రం శాంతినగర్ కాలనీకి చెందిన మాస్టర్ మిట్టు దత్తు, ఆదిలాబాద్ మండలం అనుకుంట గ్రామానికి చెందిన గాజుల జగన్నాథ ఋషి ఇందులో పాల్గొననున్నారు.



చెన్నైకి బయలుదేరి వెళ్తున్న కరాటే మాస్టర్స్